ఫిర్యాదు పెట్టు.. బేరం పట్టు..!

- మణికొండలో పెరుగుతున్న బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలు
- కొందరు ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకుల వ్యవహారం
- విసిగిపోతున్న స్థానికులు, భవన నిర్మాణదారులు
- గొడవలకు దారి తీస్తున్న వైనం
- నమోదవుతున్న కేసులు

మణికొండ: భూ సంబంధిత, నిర్మాణాలు, అనుమతుల పరంగా అక్కడక్కడ కొన్ని లోసుగులు ఉంటాయి. అయితే వాటిని తెలివిగా పట్టుకుని కొందరు ప్రబుద్ధులు వాటిపై ఫిర్యాదులు పెట్టి ఏకంగా బేరసారాలకు దిగుతున్నారు. అవి కాస్త దాడులు, పోలీసు కేసులకు దారి తీస్తున్న ఘటనలు మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వారం క్రితం మున్సిపాలిటీ పరిధిలోని వినాయకనగర్ ఫేజ్–2లో ఓ బిల్డర్ తన స్థలంలో మట్టి పోస్తుండగా పక్కనే ఉన్న ఓ ప్రైవేట్ ఉద్యోగి అడ్డుకున్నారు. అక్కడితో ఆగకుండా అతని భార్య బిల్డర్ వద్ద పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను చెప్పుతో కొట్టింది. వీటన్నింటికీ మూలం అక్కడ మట్టి పోయాలన్నా, కాలనీలో ఎవరైనా భవనం నిర్మించాలన్నా వారికి డబ్బులు ఇవ్వాలనే డిమాండ్లు పెడుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. లేదంటే ఆన్‌లైన్‌లో హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీ, రెవెన్యూ తదితర శాఖలకు ఫిర్యాదులు చేసి వేధిస్తున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. అలాంటి సంఘటనలు భరించలేక గతంలోనూ పలు చోట్ల దాడులు.. పోలీసులకు ఫిర్యాదుల వరకు వెళ్లాయి. ఇదే తరహాలో సాయి వైభవ్‌కాలనీలో ఓ బిల్డర్ తనకు తెలిసిన వారి స్థలంలో మట్టిపోసుకుంటే కాలనీ సంక్షేమ సంఘం నాయకుడు ఒకరు తనకు డబ్బు ఇస్తేనే మట్టిని పోయనిస్తానని పేచీ పెట్టుకున్నాడు. దీంతో ఆ విషయాన్ని రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసే క్రమంలో ఓ ప్రజాప్రతినిధి కల్పించుకుని సర్దిచెప్పడంతో మిన్నకుండిపోయారు.


మణికొండ మున్సిపల్ కార్యాలయం

ప్రజాప్రతినిధులదీ అదే తీరు..

ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన కొందరు ప్రజాప్రతినిధులు సైతం తమ వార్డుల్లో ఎక్కడ నిర్మాణాలు జరుగుతున్నా తమకు అడిగినంత డబ్బు ఇవ్వకపోతే బిల్డర్లు, గృహ నిర్మాణదారులను వేధిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో మున్సిపాలిటీ పరిధిలో ఇదే తరహాలో ఓ కౌన్సిలర్‌పై కేసు నమోదు కావడంతో ఆయన జైలుకు వెళ్లి తన పదవిని సైతం కోల్పోయాడు. మరో ప్రజాప్రతినిధి తన వార్డులోని ప్రజావసరాలకు ఉపయోగించే స్థలాలను పరిరక్షిస్తున్నానని పేర్కొంటూ కలెక్టర్, మున్సిపల్, హెచ్‌ఎండీఏ అధికారుల వరకు ఫిర్యాదు చేసి వాటిని పత్రికల్లో ప్రచురింపచేసుకుని తనకు రావాల్సింది రాగానే మిన్నకుంటారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కాలం చెల్లిన నిబంధనలపై ఫిర్యాదులు..

పొలాలుగా ఉన్నప్పుడు వాటికి వెళ్లేందుకు అప్పుడు బండ్ల బాటలు, నక్ష బాటలు ఉండేవి. అయితే అవి లేఅవుట్‌లుగా అయ్యాక అవే బాటలు ఏకంగా 40 నుంచి 100 అడుగుల రోడ్లుగా మారాయి. అయినా ఓ కౌన్సిలర్ వాటిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడం, అందిన కాడికి దండుకోవడం చేస్తున్నాడని అనేకమంది వాపోతున్నారు. మరో ప్రజాప్రతినిధి దేవాదాయ శాఖ భూములను పరిరక్షించాల్సింది పోయి అందులోని నిర్మాణాలు చేపట్టినవారికి అధికారులు నోటీసులు జారీ చేస్తే వారితో ఎలాంటి ఇబ్బంది లేకుండా తాను చూసుకుంటానని లక్షలు డిమాండ్ చేస్తున్నాడని సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టులు దర్శనం ఇస్తున్నాయి.

స్వలాభాపేక్ష ఫిర్యాదులపై ఉన్నతాధికారులు పట్టించుకోవద్దు..

ధనార్జనే ధ్యేయంగా ఇప్పటివరకు వందలాది ఫిర్యాదులు అలాంటి వారు ఇచ్చినా ఏ ఒక్కదానిపై చివరి వరకు నిలబడి దాన్ని పరిరక్షించింది లేదని, వారికి కావాల్సింది అందగానే మిన్నకుండడమే వారి దినచర్యగా మారిందని ఆయా వార్డుల ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే కాలనీ సంక్షేమ సంఘాల పేరుతో కొందరు, ప్రజాప్రతినిధులుగా మరికొందరు ఇలాంటి వ్యవహారాలకు దిగుతుండడంతో స్థానికులు వారితో విసిగిపోయి ఏసీబీ, పోలీసులను ఆశ్రయించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలాఉంటే మరికొందరు అనవసర విషయాల్లో ఆర్‌టీఐ ద్వారా సమాచారం సేకరించి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నట్లు తెలిసింది. స్వలాభాపేక్షతో ఇలాంటి వారు ఇచ్చే ఫిర్యాదులను కలెక్టర్, మున్సిపల్, హెచ్‌ఎండీఏ, రెవెన్యూ, దేవాదాయ, విద్యుత్, జలమండలి తదితర శాఖల అధికారులు పట్టించుకోవద్దని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

జీవితాంతం ప్రజాసేవకే అంకితం

చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

శేరిలింగంపల్లి: చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితాంతం ప్రజాసేవకే అంకితమవుతానని తనని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేస్తూ.. ప్రతి ఓటరును కలిసి కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు..

శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీలో 300 మంది బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆదివారం జగదీశ్వర్‌గౌడ్, డాక్టర్ రంజిత్‌రెడ్డి, చల్లా నర్సింహ్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజితాగౌడ్, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా నిర్మాణాలు ..!


అత్తాపూర్‌లో ఇష్టానుసారంగా కొనసాగుతున్న నిర్మాణాలు

అత్తాపూర్: అత్తాపూర్, అత్తాపూర్ ఓల్డ్ విలేజ్ తదితర ప్రాంతాల్లోని ఇరుకైన రోడ్డు మార్గాల్లో కొందరు బహుళ అంతస్తులు నిర్మిస్తూ పరిసరాలను ఆక్రమిస్తున్నారు. దీంతో గ్రామస్తులు రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ అధికారులకు వినతి పత్రాలు అందజేయడంతో వారు పనులు ఆపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. కేవలం 100–150 గజాల్లోనే ఐదారు అంతస్తుల నిర్మాణాలు చేపడుతూ 15 ఫీట్ల ఉన్న రోడ్డు వరకు ఆక్రమిస్తున్నారని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోకపోవడంతోనే ఇలాంటి సమస్యలు వచ్చి పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఘనంగా మట్టల ఆదివారం


మణికొండ సేవియర్స్ లూథరన్ చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న క్రిస్టియన్లు

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిల్లోని చర్చిల్లో ఆదివారం మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. మణికొండ సేవియర్స్ లూథరన్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో పాస్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఏసు ప్రభువుకు జయం చెప్పే కార్యక్రమంలో భాగంగా మట్టల ఆదివారాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఈత మట్టలతో నృత్యాలు చేస్తూ.. పాటలు పాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

ప్రొఫెసర్ డాక్టర్ కళాధర్ బాబు

ఏజీవర్సిటీ: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కళాధర్ బాబు అన్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు శంషాబాద్ మండల పరిధిలోని మల్కారం గ్రామంలో ఎనిమిది రోజులుగా నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని దానికి అనుకుణంగా ప్రణాళికబద్ధంగా సాధన చేస్తూ విజయాన్ని చేరుకోవాలని సూచించారు. కేవలం శిబిరాలతో మాత్రమే కాకుండా వ్యవసాయ సంబంధిత అంశాల్లోనూ రైతులకు అండగా ఉండాలన్నారు. వ్యవసాయ రంగంలో వచ్చే నూతన ఆవిష్కరణలు, నూతన వంగడాల రకాలు, సాంకేతికతను రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. యువతకు చదువుతో పాటు దేశభక్తి తప్పనిసరిగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎ యూనిట్ ప్రోగ్రాం అధికారులు సీఎస్‌ఆర్ సంతోషిని, లావణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అశ్వన్‌కుమార్, శ్రీరాములు, మల్కారం గ్రామ ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, సిబ్బంది విద్యార్థులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కళాధర్ బాబు

ఘనంగా కామ దహనాలు


బండ్లగూడలోని సాయి శక్తి సింఫనీ అపార్ట్‌మెంట్‌లో కాముని దహనం చేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: హోలీ పండుగ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో ఆదివారం కాముని దహన కార్యక్రమాలు నిర్వహించారు. అత్తాపూర్, శివరాంపల్లి తదితర ప్రాంతాల్లో శనివారం రాత్రి, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం డివిజన్లలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి కామ దహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉత్తరాధి ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అపార్ట్‌మెంట్లు, విల్లాల్లో సైతం కొనసాగాయి. అనంతరం ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ నేపథ్యంలో రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

శాంతియుతంగా జరుపుకోవాలి:పోలీసులు

హోలీ పండుగను శాంతియుత వాతావరణంలో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్ పోలీసులు ప్రజలకు సూచించారు. ప్రార్థన మందిరాల వద్ద వేడుకలు నిర్వహించుకోవద్దన్నారు. రోడ్లపై వెళ్లే వారిపై రంగులు చల్లవద్దన్నారు. అనుమతి లేకుండా ర్యాలీలు చేపట్టవద్దని, ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించవద్దన్నారు. ఎలాంటి సమస్యలున్నా.. స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.


మణికొండలో కామదహనం చేస్తున్న మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి


నార్సింగిలో కామదహనం చేస్తున్న నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్

వైన్స్, బార్లు బంద్..

హోలీ పండుగ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వైన్స్, బార్లు, కల్లు దుకాణాలను మూసివేస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

మణికొండ: హోలీ పండగను పురస్కరించుకుని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల కేంద్రాలల్లో శనివారం రాత్రి కామదహనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మణికొండలో మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, నార్సింగిలో మున్సిపల్ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. సి.బీరప్ప, బి.రవికాంత్‌రెడ్డి, సురేశ్, అరవింద్, రాజేశ్, ఇందిరా, ప్రభావతి పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ


విద్యార్థులకు బెల్ట్‌లు ప్రదానం చేసిన జేకేఏఐ డైరెక్టర్ శాంసన్

మైలార్‌దేవ్‌పల్లి: కరాటేతో ఆత్మరక్షణ పొందవచ్చని జపాన్ కరాటే అసోసియేషన్ చీఫ్ రాపోలు సుదర్శన్ అన్నారు. విద్యానగర్‌లో జేకేఏఐ బోర్డు డైరెక్టర్ శాంసన్‌తో కలిసి ఉత్తమ ప్రతిభ చూపిన మధుబన్‌కాలనీ శ్రీగాయత్రి టెక్నో విద్యార్థులకు ఆదివారం బెల్ట్‌లు ప్రదానం చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే కరాటేలో మంచి ప్రతిభ చూపాలన్నారు. నేదురి శ్రీనివాస్ కరాటే అకాడమీ నుంచి 10 మంది విద్యార్థులు ప్రతిభ చూపడంతో కరాటే మాస్టర్ శ్రీనివాస్‌ను అభినందించారు.

భగత్‌సింగ్ ఆశయాలు చాలా గొప్పవి


సమావేశంలో మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

నాంపల్లి: భగత్‌సింగ్ ఆశయాలు చాలా గొప్పవని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) హైదరాబాద్ జిల్లా కమిటీల సంయుక్తాధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో భగత్‌సింగ్ స్మారక యువజన ఉత్సవాల ముగింపు సభ జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడారు. విద్యా సంస్థల్లో విద్యార్థులకు డ్రగ్స్ లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సినీ నటుడు శివారెడ్డి మాట్లాడుతూ..దేశం కోసం యువత ఆలోచించాలన్నారు. భగత్‌సింగ్‌లాంటి యోధుల జీవితాల నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ..యువకులు భగత్‌సింగ్‌లను ఆదర్శంగా తీసుకుని సమస్యలపై పోరాడాలన్నారు. డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, అనగంటి వెంకటేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్య దర్శి ఎండి జావిద్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: సేవా కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిస్తాయని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని లాలమ్మ గార్డన్ కాలనీలోని దిలీప్‌సూపర్ మార్కెట్ ఎదుట రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లయ్య ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప, నాయకులు డి. రాజేశ్, వేణుమాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం గోల్కొండ, లంగర్‌హౌస్, టోలిచౌకీ డివిజన్‌ల నుంచి పలువురు వచ్చి ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఆయనకు వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను స్వయంగా పరిశీలిస్తున్నానన్నారు. తాను క్రమం తప్పకుండా సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి తన దృష్టికి వచ్చిన సమస్యలను వారికి వివరిస్తున్నానని అన్నారు. వర్షాకాలంలో నానల్‌నగర్, గోల్కొండ, టోలిచౌకీ తదితర డివిజన్‌లో పలు బస్తీలు ముంపునకు గురయ్యేవని అయితే ఆయా ప్రాంతాల్లో వరద ముంపు నివారణకు చేపట్టిన పనుల వల్ల ఆయా బస్తీలకు వరద ముంపు ప్రమాదం తప్పిందని ఆయన అన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.



చెక్కుచెదరని చారిత్రక మసీదులు


కుతుబ్‌షాహి రాజులు ప్రార్థనలు చేసిన కుతుబ్‌షిహి మసీదు

- ఇప్పటికీ ఆకట్టుకుంటున్న కుతుబ్‌షాహి కాలం నాటి మసీదులు
- ప్రత్యేక డిజైన్‌లతో నిర్మాణం

గోల్కొండ: చారిత్రక మసీదులకు గోల్కొండ, షేక్‌పేట్ ప్రాంతాలు ప్రసిద్ధి. గోల్కొండ కోట నిర్మాణ కాలంలోనే ఈ మసీదుల నిర్మాణానికి పునాదులు పడ్డాయి. ఈ ప్రాంతాలలో ఐదు వందల ఏళ్లక్రితం నిర్మించిన మసీదులు నేటికి చెక్కు చెదరకుండా ఉన్నాయి. కుతుబ్‌షాహి వంశపు రాజులు, కుటుంబ సభ్యుల కోసం గోల్కొండ కోట మెయిన్ గేటు ముందు ప్రత్యేకంగా జామా మసీదు నిర్మించబడింది. ప్రతినిత్యం గోల్కొండకోట రాజ్‌మహల్ నుంచి రాజు ఈ మసీదుకు వచ్చి ప్రార్థనలు చేసే వారు. అదేవిధంగా సేనాధిపతి, సైనికులు, రాజును కలవడానికి వివిధ ప్రదేశాల నుంచి వచ్చే వారికోసం ప్రత్యేకంగా మసీదును ఆకాలంలో నిర్మించబడ్డాయి.

సైనికుల కోసం ప్రత్యేకంగా..

గోల్కొండ కోటకు ఉన్న ప్రధాన దర్వాజాలైన మోతీదర్వాజా, ఫతేదర్వాజా, మక్కైదర్వాజాల వద్ద సైనికుల కోసం ప్రత్యేకంగా మసీదులు నిర్మించబడ్డాయి. అంతేకాకుండా గోల్కొండ ప్రహరీకి కాపాల కాసే సైనికులకు ప్రహరీని అనుకోని చిన్నచిన్న మసీదులు కూడా నిర్మించబడ్డాయి. అప్పటి ఇతర దేశాల నుంచి గోల్కొండ కోటలో రాజును కలవడానికి వచ్చే అతిథులు, రాయబారుల కోసం షేక్‌పేట్‌లో విడిది గృహంతో పాటు అతిథుల కోసం ప్రత్యేకంగా మసీదు నిర్మించారు. వీటిలో అబ్దుల్లా మసీదు ఒకటి మాత్రమే పూర్తిగా శిథిలావస్థలో ఉండగా ఇతర మసీదులు నేటికి దర్జాగా రాజ ఠీవీని వలకబోస్తున్నాయి.

పిడుగు పడినా చెక్కుచెదరకుండా..

గోల్కొండ కోట ముందు గల కుతుబ్‌షాహి జామా మసీదు, బడాబజార్‌లోని చీనీ మసీదు, లంగర్‌ఖానా మసీదులలో నేటికీ ముస్లిం సోదరులు నమాజ్ ఆచరిస్తున్నారు. మోతీ దర్వాజా వద్ద గల మోతీ మసీదుకు కూడా నేడు చెక్కు చెదరకుండా ఉంది. లంగర్‌హౌస్ చెరువును ఆనుకొని ఉన్న కుతుబ్‌షాహీ మసీదు సైతం నేటికి చెక్కుచెదరకుండా ఉంది. గత సంవత్సరం వర్షాకాలంలో ఈ మసీదుపై పిడుగు పడినా కూడా మసీదుకు ఎటువంటి నష్టం వాటిల్లలేదు.



ప్రత్యేక శైలితో నిర్మాణం...

- గోల్కొండ కుతుబ్‌షాహీ మసీదు, లంగర్‌ఖానా మజీదులు ప్రత్యేక శైలితో నిర్మించబడ్డాయి.
- వీటి నిర్మాణానికి డంగు సున్నంతో పాటు మట్టి ఇటుకలు వాడబడ్డాయి. ఈ మసీదులకు కమాన్‌లు ఎంతో సన్నగా, ఆకర్షనీయంగా నిర్మించబడ్డాయి.
- ఇండో పర్షియన్ శైలికి అద్దం పడుతున్న ఈ మసీదులు పిడుగు పాటును కూడా తట్టుకోగలవు.
- వీటిలో కొన్ని మసీదులలో వెయ్యి మంది వరకు నమాజ్ ఆచరించే వీలు ఉంది. మరికొన్ని మసీదులు 50–200 మంది వరకు మాత్రమే సరిపోయే విధంగా నిర్మించబడ్డాయి.
- మసీదు మధ్యలో ప్రత్యేక శైలితో అలంకరించి వాటికి ఆనాటి నిర్మాణ శైలికి అనుగుణంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ పూత కూడా వేయడం జరిగింది. అయితే ప్రస్తుతం ఈ మసీదుల వర్షినాలిటీకి ఏ మాత్రం దెబ్బతగలకుండా మసీదు నిర్వాహణ కమిటీలు సంవత్సరానికి ఒకసారి వైట్ వాషింగ్ చేస్తున్నాయి.

డబుల్ రిజిస్ట్రేషన్ చేయిస్తే క్రిమినల్ కేసులు పెడతాం

డైమండ్ హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుల తీర్మానం

రాయదుర్గం: డైమండ్ హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుల సమావేశం ఆదివారం కాలనీలోని కారు లాంజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మా కాలనీలోని ప్లాట్లకు డబుల్ రిజిస్ట్రేషన్లు చేసిన వారందరిపై క్రిమినల్ కేసులు పెడతామని సభ్యులందరూ.. ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. పాత పత్రాలను తిరస్కరించకుండా డబుల్ రిజిస్ట్రేషన్ చెల్లదని, దాని ఆధారంగా కోర్టుకు వెళ్లాలని హైకోర్టు తీర్పుతో స్పష్టతను ఇచ్చిందన్నారు. ఎల్లవేళలా లిటిగేషన్లు పెట్టి మమ్మల్ని వేధించొద్దని మేమంతా కలిసి లిటిగేట్‌లందరికీ చెబుతున్నామని, ఎవరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఇబ్బంది పెట్టే వారందరిపై క్రిమినల్ కేసులు పెట్టాలని తీర్మానం చేశారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అభ్యర్థన లేఖ కూడా రాయాలని తీర్మానించారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన



మాదాపూర్: కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఐశ్వర్యవల్లి శిష్య బృందంచే భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. పుష్పాంజలి, గరుడగమన, పంచమూర్తి కౌతం, జతిస్వరం, గణేశపంచరత్న, చంద్రచూడ శివశంకర, మురళీధర కీర్తనం, దశావతారం, అదివో అల్లదిగో తదితర ప్రదర్శనలతో అలరించారు. కళాకారులు ఆరాధ్య, ప్రవళిక, తన్వి, శ్రిష్టి, సాహితి, కుసుమిత తదితరులున్నారు.